


భోగి వేడుకల్లో ఆకతాయిల వీరంగం

పలువురికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వాహనాలను నిదానంగా నడపమన్న వారిపై కొందరు ఆకతాయిలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన సంఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని భాస్కర పేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భాస్కరపేటలోని స్థానిక యువత భోగి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో మద్యం తాగిన కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుకుంటూ వెళ్లారు. ఇది తప్పు అని, నిదానంగా వెళ్లాలని స్థానికులు ఆకతాయిలకు మితవు పలికారు. దీంతో రెచ్చిపోయిన ఆకతాయిలు తమ వెంట మరికొందరిని తీసుకువచ్చి స్థానికులపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో పాండియన్ ముత్తు, పాండీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన టూ టౌన్ పోలీసులు దాడికి కారణమైన చందు(వీఎంపల్లి), భాను(ఏనుగులగుంట) లతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు.

నారావారిపల్లిలో పలు అభివృద్ధి పనులు

- శిలాఫలకాలు ఆవిష్కరించిన సిఎం
- ఎస్‌సి మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ
- నాణ్యమైన విద్యుత్‌కు ఇండోర్ మినీ విద్యుత్ సబ్ స్టేషన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి స్వగ్రామం నారావారిపల్లిలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సంక్రాంతి సంబరాల కోసం గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ కోసం శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎస్‌సి మహిళలకు ఆర్థిక స్వావలంబనకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. రైతులకు ప్రయోజనకరంగా పరస్పర అంగీకార ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా అర్హులైన రైతులకు అందరికి బిందు తుంపర సేద్య పరికరాలను మంజూరు చేయాలని జిల్లా ఏపీఎంఐపి అధికారి సతీష్ ను ఆదేశించారు. ఈ ప్రాంతంలో రైతులు విద్యుత్ సమస్యలతో బాధపడుతున్నారని తెలుసుకొని నారావారి పల్లెలో 4.27 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 33/11 కెవి ఇండోర్ సెమీసబ్ స్టేషన్ ఏర్పాటుకు శిలాఫలకం ఆవిష్కరించారు. త్వరితగతిన సబ్ స్టేషన్ నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్ రావును చంద్రబాబు కోరారు. నారావారిపల్లి లోని ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటుతో కవర్ చేయాలని తెలుపుతూ, అధికారులకు పలు సూచనలు చేశారు.

26 రోడ్లకు మహర్దశ


జాతీయ ఉపాధి హామీ పథకం కింద నారావారి పల్లి ప్రాంతంలోని మూడు సచివాలయల పరిధిలో 3.21 కోట్ల రూపాయలతో 26 రోడ్లు అభివృద్ధి చేయటానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ పనులను శరవేగంతో పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు. పనులను నిత్యం పర్యవేక్షించాలని, మంచి నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు.

ఆర్ట్ స్టేట్ మోడల్ స్కూల్‌గా ఏ రంగంపేట ఉన్నత పాఠశాల

నారావారి పల్లె ప్రాంత అభివృద్ధిలో భాగంగా ఎ రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా అభివృద్ధి చేయటానికి ముఖ్యమంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శ్రీసిటీ సౌజన్యంతో 1.10 కోట్ల రూపాయలతో పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐ ఎఫ్ పి ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఎఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామగ్రితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు చెన్నై ఐఐటి వారి ద్వారా బోధన చేపట్టనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ విద్యను అందించనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు బోధన

ముఖ్యమంత్రి సమక్షంలో శిశు, మహిళ సంక్షేమ శాఖ, కేర్ అండ్ గ్రో పరస్పర అంగీకార ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఐదేళ్ల



ప్రజా సమస్యలు ఆలకిస్తున్న చంద్రబాబు

లోపు పిల్లలకు మంచి భవిష్యత్తును అందించే విధంగా ప్రాజెక్టుకు ఏంఓయుపై సంతకం చేశారని తెలిపారు. కేర్ అండ్ గ్రో ద్వారా కుప్పంలో 480 సెంటర్లలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లల మానసిక, శారీరక, విద్యా పరమైన అంశాలలో మెరుగ్గా ఫలితాలు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. తల్లులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించే ఈ కార్యక్రమం కుప్పంలో మంచి ఫలితాలు ఇస్తోందని, ఇక్కడ కూడా మంచి ఫలితాలు రావాలన్నారు. ఈ పరస్పర అంగీకార ఒప్పంద పత్రాలపై జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, కేర్ అండ్ గ్రో ఫౌండర్ డాక్టర్ మేఘన సంతకాలు చేశారు.

ఈజీ మార్టుతో పరస్పర అంగీకారం

ఇంటి వద్ద నుంచే డ్వాక్రా సంఘాల గ్రామీణ మహిళలు కిరాణా షాపులు నిర్వహించుకోవడానికి వస్తువులను సరఫరా చేసి తద్వారా వారి ఆర్థిక స్థితి గతులు మార్చుకునే సౌలభ్యం కల్పించడానికి ఈజిమార్ట్ ,డిఆర్డిఏ – వెలుగు సంస్థ ల మధ్య పరస్పర అంగీకార ఒప్పందంపా సంతకం చేసి ఎంఓయు లు మార్పిడి చేసుకున్నారు. ఇందులో డిఆర్డిఏ వెలుగు పీడీ శోభన్ బాబు ఈజీమార్ట్ ఫౌండర్ అండ్ సీఈఓ వెంకట్ నల్లపాటి సంతకాలు చేశారు.


నారా వారి పల్లి సమీపంలోని 5 గ్రామాల 200 మంది మామిడి రైతులతో ఎఫ్ పి ఓ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి అందించారు. ప్రభుత్వ స్కీంల వినియోగంతో ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెటింగ్ అనుసంధానంతో బిగ్ బాస్కెట్, రిలయన్స్, ప్రాసెసింగ్ యూనిట్లకు నేరుగా మార్కెటింగ్ చేసుకోవడం వల్ల మధ్యవర్తులు లేకుండా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రైమరీ ప్యాకింగ్ అండ్ గ్రేడింగ్ చేసుకుని నేరుగా వారు అమ్ముకునేందుకు ఈ ఎఫ్పీఓ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం తెలిపారు. ఇది సక్రమంగా అమలు జరిగేటట్లు చూడాలని ఎస్ పి ఓ లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డిని ఆదేశించారు.

ఎస్‌సి మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ

ఎస్సీ డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రధానమంత్రి అనుచిత్ జాతీయ అభ్యుదయ పథకం ద్వారా డిఆర్‌డిఏ – వెలుగు , ఎస్సీ కార్పొరేషన్ లు కలిసి నారావారిపల్లి, చిన్న రామాపురం గ్రామాలలో మహిళలకు 3.5 లక్షల రూపాయల విలువచేసే15 ఎలక్ట్రిక్ ఆటోలు అందించారు. ఇందులో 50శాతం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా నెలకు 12వేల రూపాయల పెట్రోల్ ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణ హితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జెసి శుభం బన్సాల్, జిల్లా పంచాయతీ అధికారిణి, నారావారి పల్లి ప్రత్యేక అధికారి సుశీలా దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వగృహమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం భోగి పండుగ సందర్భంగా సీఎం చంద్రబాబు స్వగృహంలో భోగి మంటలు మండలేదు. సీఎం చంద్రబాబు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు మృతి చెందిన కారణంగా భోగి పండుగ నిర్వహించలేదు. సోమవారం ఉదయం జిల్లా నలుమూలల నుండి పలు సమస్యలపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజలు నారావారిపల్లెకు చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా మహిళలకు గొబ్బిలాటలు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బెలూన్ బ్లాస్టింగ్, గన్ని బ్యాగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, పొటాటో గ్యాదరింగ్, లెమన్ స్పూన్, వంటి ఉత్సాహమైన క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడా



ముగ్గుల పోటీ విజేతను అభినందిస్తున్న ముఖ్యమంత్రి

పోటీలను సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి, నందమూరి వసుంధర, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి వెంకటమణి ప్రసాద్, గాలి భాను ప్రకాష్, ఎన్ అమరనాథ రెడ్డి, వీక్షించారు. విజేతలైన మహిళలకు విద్యార్థులకు రూ.10116 నగదు బహుమతిని సీఎం చంద్రబాబు నాయుడు అందించారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు వేసి ఇంటికి వెళుతుండగా భీమవరం గ్రామానికి చెందిన నాగరాజమ్మ, సుబ్రహ్మణ్యం దంపతులను చూసి చంద్రబాబు ఏం సమస్య అని ఆ వృద్ధ దంపతులను అడగగా తాను పక్షవాతంతో బాధపడుతున్నాను. నాకు వికలాంగు పెన్షన్ మంజూరు చేయించాలని చెప్పడంతో వెంటనే కలెక్టరును పిలిచి దివ్యాంగ పెంచిన మంజూరు చేయాలని ఆదేశించి మానవత్వం చాటుకున్నారు.



మహిళలకు ఆటో తాళాలు అందిస్తున్న ముఖ్యమంత్రి

నిరసనాగ్రహం..

- భోగి మంటల్లో వేసి విద్యుత్ బిల్లులు దహనం
- ఛార్జీల పెంపును ఉపసంహరించాలి
- సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ రకాల పేరిట పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజలపై మోపిన భారం తగ్గించాలని కోరుతూ సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, కెవిపిఎస్, తదితర సంఘాల ఆధ్వర్యంలో ప్రజలు సోమవారం జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు శ్రీకాళహస్తి మండలం, అమ్మ చెరువు గ్రామంలో గ్రామస్తులతో కలిసి విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేస దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చి ఆరు నెలలు గడవకముందే రెండు దఫాలు ఛార్జీలు 15 వేల కోట్లు పైన పెంచి ప్రజల పైన పెంచి భారం మోపిందన్నారు. ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్లకి సంపదను సులభంగా ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోం దన్నారు. అదానీపై అమెరికాలో కేసు పెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడమే దీనికి నిదర్శనం అన్నారు. స్మార్ట్ మీటర్ బిగించి ప్రజలను రైతులను మోసం చేయాలని చూడడం తగదన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విచారణ వినియోగదారులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చేదిగా లేదన్నారు. రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించి వారికి



రేణిగుంటలో

కూడా అన్యాయం చేసే కార్యక్రమం చేపట్టారన్నారు. వెంటనే విద్యుత్ బిల్లుల పెంపును తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. తిరుపతిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి కే వేణుగోపాల్, ఆర్ లక్ష్మి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమలత , బుజ్జి రంగయ్య పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట సుందరయ్య భవనం వద్ద కరెంటు బిల్లులతో తయారు చేసిన రాక్షస బొమ్మను భోగి మంటల్లో వేసి తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. 'అయ్య బాబోయ్.. కరెంటు బిల్లు.. గుండె లోన పడెను చిల్లు.. సెకీతో ఒప్పందాలు టోటల్ గోలు మాలు.. అయ్యయ్యో.. అయ్యయ్యో..!' అంటూ వినూత్న రీతిలో పాట పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాధాకృష్ణ, వెంకటేష్, సెల్వరాజ్, కుప్ప స్వామి ఓ వెంకట రమణ పాల్గొన్నారు.



గూడూరులో

గూడూరు టౌన్ : విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో గూడూరు ఒకటవ పట్టణం, రెండవ పట్టణం పరిధిలోని పది ఏరియాలలో ప్రజలకు తెలుపుతూ స్థానిక ప్రజలతో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో గూడూరు సిపిఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు



కవిబిపురంలో

అధ్యక్ష, కార్యదర్శులు బివి రమణయ్య, ఎస్ సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బి చంద్రయ్య, గోను మదన్, బల్లి లవకుమార్, చిన్నయ్య, రైతు, ప్రజా సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

కెవిబిపురం: విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా కేవిబిపురం మండలంలోని రాయపేడులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో దహనం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంపై సాకులు చెప్పి 18 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రజలపై కొత్తగా విద్యుత్ ఛార్జీలు పెంచి ఏమీ ఎరగనట్టు ఈ పాపం అంతా గత ప్రభుత్వం మీదకు తోసివేయడం అన్యాయమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. మండలంలో బ్రాహ్మణపల్లి, కొత్తూరు, కస్తూరి పురం, ఎగువపూడి, కర్లపూడి, తదితర గ్రామాల్లో భోగిమంటల్లో బిల్లులు కాల్చి నిరసన తెలిపారు.



పుత్తూరులో

ఈ కార్యక్రమంలో రైతులు నాగూరు, బాలయ్య, చిరంజీవి, మంజుల, శాంతి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పుత్తూరు పట్టణంలోని నందిమంగళంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పుత్తూరు పట్టణ కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపు అన్యాయమన్నారు. ట్రూ అప్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిమంగళం గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండుగ

- హుషారుగా పరుష పందేలు
- రంకెలేసిన కోడె గిత్తలు.. యువకుల బేజారు..

ప్రజాశక్తి-రామచంద్రపురం: 'పట్టుకో... పట్టుకో.. దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి' అంటూ.. రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లె లో సోమవారం పరుష పందేలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం సంక్రాంతి పర్వదినాలలో మొదటి రోజైన భోగి పండుగ రోజున రాష్ట్రంలో మొట్ట మొదట చంద్రగిరి నియోజకవర్గం అనుపల్లి లో నిర్వహించిన పశువుల పండుగతో రాష్ట్ర మొత్తం జల్లికట్టు ఉత్సవాలు ప్రారంభ మవుతాయి. అనుపల్లె గ్రామంలో కోడిగిత్తలు రంకెలతో యువకుల హుషారుతో జల్లికట్టు జోరుగా సాగింది. గ్రామం లో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడె గిత్తలు, ఆవులను రైతులు వాటి కొమ్ములను నున్నగా చెక్కి, కొమ్ములకు రంగులు పూసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషకం కట్టి ' నా కోడిగిత్తల పౌరషాన్ని చూడండి..' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం ..'అంటూ యువతకు సవాల్ విసిరారు. కోడెగిత్తల కొమ్ములకు బంగారు, వెండి ఆభరణాలు , అభిమాన, రాజకీయ, సినీ నటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి పందేల బరిలోకి దించి, కోడె గిత్తలను డబ్బులు కొడుతూ బెదిరించి పరుగులెత్తించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన బంగారు వెండి ఆభరణాలు, నగదు, పలకలను చేజిక్కించుకునేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు పౌరుషంతో పశువులు, కోడిగిత్తల పట్టుకునేందుకు పరుగులు పెట్టి బహుమతులను గెలుచుకుంటూ ప్రేక్షకులకు చూపిస్తూ 'నేనే విజేతను' అంటూ యువకులు కేరింతలు వేశారు. ఈ పోటీలలో యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ పందేలను తిలకించేందుకు వచ్చిన జనంతో అనుపల్లి గ్రామం జనసంద్రమైంది. ఈ పరుష పందేలను తిలకించేందుకు దేశ విదేశాల నుండి, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. మందు బాబుల ఆగడాలు మితిమీరాయి. పరుష పందేలకు విచ్చేసిన ప్రేక్షకులకు గ్రామానికి చెందిన తారాసి యశ్వంత్, బొడ్డు ముని ప్రసాద్‌లు అన్న పానీయాలు ఐదువేల మందికి పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘట నలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోడె గిత్తలను నిలువరిస్తున్న యువకులు

ప్రజలపై మరో భారం!

- పెరగనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు
- రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం
- పారిశ్రామిక వాడలే ప్రధాన ఆదాయ వనరులు
- ఇప్పటికే ఛార్జీల భారం
- అదనమంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వం నూతన సంవత్సర, సంక్రాంతి కానుకగా జనంపై కొత్త భారం వేసేందుకు సిద్ధమైంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనా పరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందిం చింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలు దారులు చెల్లించాల్సి వుంది. నూతన పాలసీ ప్రకారం భూముల విలువ 15 నుంచి 20 శాతం పెరగనుంది. పరిసర ప్రాంతాల్లో భారీగా భూముల ధరలు పెరిగాయి. వీటి పరిధిలో రియల్ ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే సాగుతుంటాయి. కానీ, గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో కూడా భూముల క్రయవిక్రయాలు తగ్గాయి. ఇలాంటి తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా భూముల ధరలను మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 15 నుంచి 20 శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

మూడు గ్రూపులుగా వ్యవసాయ భూములు..

ఇప్పటి వరకు వ్యవసాయ భూములకు ఒకేవిధంగా రిజిస్ట్రేషన్ విలువ ఉండేది. ఈసారి వాటిని మూడు రకాలుగా వర్గీకరిస్తున్నాం. జిల్లాలో పండ్లు (మామిడి, నిమ్మ తదితరవి), పూల (మల్లె, బంతి, చామంతి) సాగు ఎక్కువగా ఉంటుంది. వీటిని గార్డెన్ కింద తొలి ప్రాధాన్యతగా తీసుకున్నాం. ఆ తర్వాత మాగాణి , మెట్ట భూములు, చివరగా మెట్ట (డ్రై) భూములను తీసుకుంటే మెట్ట విలువ సవరణలో గార్డెన్ మెట్ట, మాగాణి మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఒక సర్వే నంబర్ వర్గీకరణ మారితే దానినే పరిగణలోకి తీసుకుంటారు పక్కన మాగాణి ధర మామూలుగానే ఉంటుంది. ఓ పది ఎకరాల వ్యవసాయ తోటలో 100 అంకణాల ఇల్లు నిర్మించుకొని ఉంటే గార్డెన్‌కు ఉండే విలువ రెసిడెన్షియల్ కంటే ఉండే విలువ వేరుగా ఉంటుంది.

కొన్నిచోట్ల 15 శాతం పెంపుదల ఇలా..

ప్రస్తుతం ఎకరా ధర రూ.20 లక్షలు ఉంటే, ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7 శాతం అంటే రూ.1.50 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో 15 శాతం భూమి విలువ పెడితే ఈ ప్రాంతంలో ఎకరాకు రూ. లక్షలు చొప్పున పెరిగి, దాని విలువ రూ.23 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీని పై రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1,72,500 పడుతుంది. అంటే అదనంగా రూ. 22,550 వరకు కలిగి వుంది. ఇక కొనుగోళ్లపైనా దాదాపు అదే తరహాలో భారం పడనుంది.

పారిశ్రామిక వాడలే ప్రధానం...

తిరుపతి నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లున్న ప్రాంతాల్లో భూముల విలువలను సవరించాం. తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి మండలాల నుంచి 70 శాతం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వస్తుంది. మిగిలిన 30 శాతం ఇతర మండలాల నుంచి వస్తుంది. 70 శాతంలో కూడా తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల నుంచి 55 శాతం ఆదాయం వస్తుంది. అందువల్ల ఈ మండలాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాం.

క్రయవిక్రయాలపై ప్రభావం

జిల్లాలో ప్రస్తుతం భూముల ధరలకు రెచ్చలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు తరచూ పెరుగుతుండటంతో ఆ ప్రభావం భూముల క్రయ విక్రయాలపై పడుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.



తిరుపతిలో కొంత తగ్గింపు.. కొంత పెంపు



తిరుపతి నగరంలో అపార్టమెంట్ల విలువ పెంచలేదు. అదే విధంగా 19, 20 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం ఆస్తుల విలువ ఎక్కువ గానే ఉండడంతో వాటిని కూడా సవరించలేదు. ఇక 1 నుంచి 17 డివిజన్ల వరకు చదరపు గజానికి వెయ్యి రూపాయలు, 21 నుంచి 23 డివిజన్లలో ప్రస్తుతం ఉన్న విలువకు 20 శాతం పెంచేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు స్వీకరిస్తారు. కమిటీ ముందు పెట్టి రివిజన్ చేస్తారు.. తుది నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే..

- శ్రీరామ్ కుమార్, తిరుపతి జిల్లా సబ్ రిజిస్ట్రారు.

అధికారుల నిర్లక్ష్యం

- ఆర్అండ్బి రోడ్డుపై కనిపించని హెచ్చరిక బోర్డులు
- అడుగడుగునా ప్రమాదాలు
- రోడ్డు మధ్యలో డివైడర్లే కారణం

ప్రజాశక్తి -కోట: ఆర్అండ్బి రోడ్డుపై మధ్యలో డివైడర్ ముందు అటూ ఇటూ హెచ్చరిక బోర్డులు లేక అడుగడుగునా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసినా ఆర్అండ్బి అధికారులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు మౌనంగా ఉండి పోవడంలో స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయినా ఆర్అండ్బి అధికారులకు ఎలాంటి చలనం ఉండడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఒక రోజు, రెండు రోజులు కాదూ..నిరంతరం కోట క్రాస్ రోడ్డు, తిన్నెలపూడికి వెళ్లే డివైడర్, విద్యానగర్ పెట్రోల్ బంక్, బాలభారతి డివైడర్, చిట్టేడు మెయిన్ రోడ్డు, కొండగుంట వద్ద, కడివేడు డివైడర్ ఉండే చోట్ల హెచ్చరిక బోర్డులు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులు క్రితం రెండు కార్లు రెండు సార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ 12 వ తేది రాత్రి ఇలా..తిన్నెలపూడి గ్రామానికి వెళ్లే చోట డివైడర్ నాయుడుపేట కు చెందిన కొంత మంది వాకాడు నుండి వస్తుండగా హెచ్చరిక బోర్డు కనబడక డివైడర్ను ఢీ కొనడంతో కారు ఒక్కసారిగా బోల్తాపడి కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. విద్యానగర్కి చెందిన ఓ కారు ఢీ కొని పక్కనే ఉన్న నీటి కాలువలో పడి పోయింది. చాక చక్యంగా ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కార్ డ్రైవర్ కారు డోర్ పగలగొట్టి ప్రమాదం నుండి బయటపడ్డాడు. ఇటీవల శ్యాంప్రసాద్ రెడ్డి పెట్రోల్ బంక్ ముందు ఆర్అండ్బి రోడ్డు మధ్యలో డివైడర్ ఉన్న కారణంగా ఆటో, కారు ఢీకొని స్వల్ప ప్రమాదంతో బయటపడ్డారు. బాలాభారతి స్కూలు వద్ద హెచ్చరిక బోర్డు లేని డివైడర్ను పరిశీలించక పోవడంతో ఒక్కసారిగా లారీ డివైడర్ మధ్యలో దూసుకుపోయింది. మరికొన్ని రోజులు తర్వాత కారు ఇదే రీతిలో ఢీకొని పక్కకు వచ్చి కారు ఆగింది. వారం రోజుల క్రితం ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో వాకాడు గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఫంక్షన్కు ఓ ఉపాధ్యాయ కుటుంబం హాజరై తిరుగు ప్రయాణంలో కొత్తవారు అయినా హెచ్చరిక బోర్డులు లేక రోడ్డు అంతా సాఫీగా ఉందనుకుని మధ్యలో డివైడర్ ఉండే విషయం కనిపించక డివైడర్ ను ఢీ కొని పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ను ఢీకొట్టారు. అయితే కారు ఢీ కొనడంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి లక్షలు, కోట్లు రూపాయలు ఖర్చు అయ్యేలా నిధులు లేవనో, లేదా త్వరలో చేస్తామనో ఆర్అండ్బి అధికారులు ప్రజలకు సోది చెప్పినట్లు చెబుతూ పబ్బం గడిపేస్తున్నారు. కోట ఆర్అండ్బీ అధికారులు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి.. ఎప్పుడైనా కార్యాలయానికి వెళితే సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, మరొక అటెండర్ మాత్రమే దర్శనమిస్తుంటారు. ఆర్అండ్బీ డిఈని కాని, ఏఈని అడిగితే అక్కడ ఉండే సిబ్బంది వాళ్లు ఇప్పుడే సైట్కి వెళ్లారని ఆనవాయితీగా చెప్తున్నారు. ప్రధానమైన సమస్యాత్మక మైన ప్రదేశాలు కోటలో పలు చోట్ల ఉంటే, ఇవన్నీ పరిశీలించకుండా (వదిలేసి) తీర ప్రాంత గ్రామాలకు ఆర్అండ్బి అధికారులు వెళుతున్నట్లు కార్యాలయ సిబ్బంది చెప్తుంటారు. నిర్మించిన డివైడర్లకు ఓ రంగు గానీ, ఏదైనా సిగ్నల్స్ లాంటివి కానీ లేకపోవడం ప్రయాణికులకు ప్రమాదాల శాపంగా మారింది. ఇన్ని సంఘటనలు (ప్రమాదాలు) జరిగి పలు పత్రికల్లో, సోషల్ మీడియాల్లో వచ్చినా ఆర్అండ్బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా వుంది. గతంలో ఆర్అండ్బీ డిఈ గా కుమార్ అనే అధికారి ఉండేవారు. నిరంతరం ఆర్అండ్బీ కార్యాలయంలోనే ఉండి రోడ్డు పనుల విషయాల్లో చురుకుగా వుంటూ స్పందించేవారని స్థానిక ప్రజలు అంటున్నారు. అయితే ఇటీవల ఢిల్లీ ఏపీ భవన్ నుండి చంద్రశేఖర్ రెడ్డి బదిలీపై కోట మండలానికి వచ్చారు. ఆర్అండ్బి ఏఈగా యోహాన్ బదిలీపై కోట మండలానికి వచ్చారు. డీ ఈ, ఏ ఈ లు రెగ్యులర్ గా ఉన్నారు. పనుల్లో చురుకుగా ఉంటారని భావిస్తున్నారు. కానీ ప్రజలు భావించినంతలో సుమారు 50 శాతం కూడా ముందంజలో లేరని కోట మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్బి అధికారులు స్పందించి ప్రమాదకరిత రోడ్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రస్తుతం స్వల్పపాటి మరమ్మతులు చేయాలని కోట మండల ప్రజలు కోరుతున్నారు. తిన్నెలపూడి గ్రామానికి వెళ్లే డివైడర్ను ఢీకొన్న కారు కోట తిన్నెలపూడి కి వెళ్లే మెయిన్ రోడ్డు మధ్యలో డివైడర్కు హెచ్చరిక బోర్డు లేక, హెచ్చరిక బోర్డులు లేని డివైడర్ వల్ల అనునిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మరొకొంత మంది కారులో ప్రయాణిస్తు డివైడర్ ని ఢీకొనడం వల్ల పలువురికి గాయాలు, పలు కార్లు ధ్వంసం అవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్బి అధికారులు లు స్పందించి డివైడర్లకు హెచ్చరిక బోర్డులను నిర్మించి ప్రమాదాలను అరికట్టాల్సి వుంది.


హెచ్చరిక బోర్డు లేక ప్రమాదకరంగా మారిన డివైడర్


గతంలో ప్రమాదానికి గురైన కారు

క్రైం న్యూస్

పెంచలయ్య అరెస్ట్

- 555 గ్రాముల బంగారం స్వాధీనం
- [illegible]


పోలీసుల అదుపులో నిందితుడు పెంచలయ్య

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి పరకామణిలో బంగారం అపహరించిన కేసులో తిరుపతికి చెందిన వీరితల్లి పెంచలయ్యను తిరుమల ఒన్టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి 555 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. తిరుమల ఒన్టౌన్ పోలీసుల కథనం మేరకు.. అగ్రిగోస్ కంపెనీ ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగిగా రెండు సంవత్సరాలు నుండి పెంచలయ్య పనిచేస్తున్నాడని గత సంవత్సరం కాలంగా తాను త్వరగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో పరకామణిలోని గోల్డ్ స్ట్రాంగ్ గదిలో ఉండే బంగారు వస్తువులను తీసుకెళ్లాడని తెలిపారు. అతనిపై నిఘా ఉంచగా ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం గోల్డ్ స్ట్రాంగ్ గదిలో ఉన్న ఒక 100 గ్రాముల బంగారు బిస్కెట్ ను దొంగిలించి దానిని ట్రాలీ కింది వైపు పైపులో దాచి వుంచాడని తెలిపారు. తనిఖీ సమయంలో టిటిడి భద్రతా సిబ్బంది గుర్తించగా, పెంచలయ్య పరారయ్యాడని, ఈ విషయంగా విజిలెన్స్ సిబ్బంది తిరుమల 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై తిరుమల ఒన్ టౌన్ పోలీసు వారు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం పెంచలయ్యను అదుపులోకి తీసుకుని విచారించి 555 గ్రాముల బరువు కలిగిన బంగారు బిస్కెట్స్, ఆభరణాలు మొత్తం 655 గ్రాములు, 157 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వాటి మొత్తం విలువ సుమారు 46 లక్షలు వుంటుందని తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన తిరుమల ఒన్ టౌన్ పోలీసు సిబ్బందిని తిరుమల అదనపు ఎస్పి, డిఎస్పీలు అభినందించారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు పంచాయతీ పరిధిలో చెత్త బుట్టలను గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సెక్రెటరీ ముని రవికుమార్ పర్యవేక్షణలో చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో పలువురు వార్డు సభ్యులకు చెత్త బుట్టలను గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వార్డు సభ్యుల ద్వారా ప్రతి ఇంటికీ చెత్త బుట్టల పంపిణీ చేస్తామన్నారు. రోజువారీగా ఇంట్లో పోగొయ్యే చెత్తను తీసుకొచ్చి రోడ్లపై పడేయ కూడదన్నారు. తప్పని సరిగా చెత్త బుట్టలో వేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. తద్వారా పంచాయతీ పారిశుధ్య పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం పంచాయతీ వార్డు సభ్యులకు, గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ చెత్త బుట్టలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వైస్ ప్రసిడెంట్ రఫీరాణి, వార్డు సభ్యులు మహేష్, ఢిల్లీ, కోనయ్య, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, బిల్ కలెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం తొమ్మిదో రోజుకు చేరాయి. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా కార్మికులు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వచ్చిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ తొమ్మిది రోజుల నుండి మున్సిపల్ కార్మికులు దీక్షలు చేస్తుంటే వారి సమస్యలు మున్సిపల్ ఛైర్పర్సన్ పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రయత్నం చేయకపోవడం బాధాకరమని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అంటే అంత చిన్న చూపు పనికిరాదని అన్నారు. చైర్ పర్సన్ వెంటనే శిబిరం దగ్గరికి వచ్చి కార్మికులు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. దుర్భాలాడిన ఇన్ఛార్జి కమిషనర్ శ్రీధర్ వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. క్షమాపణ చెప్పేదాకా పోరాటం ఆగదని అన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం తగదన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్పై లేబర్ ఆఫీసర్ కేసు నమోదు చేయాలన్నారు. పాలకులు, కమిషనర్ వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య, ఇందరమ్మ, మాధురి, వెంకటమ్మ పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఇంట భోగి సంబరాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి పండుగను చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబీకులతో కలసి ఘనంగా జరుపున్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని ఆయన ఇంటి వద్ద తన పిల్లలు, పెద్దలు బంధువులు అందరితో కలిసి గుమ్మం ముందు భోగి మంటలు వేసి సందడి చేశారు. భోగి మంట వద్ద అందరితో కలిసి సరదాగా గడిపారు. అనంతరం చెవిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు గంగిరెద్దులు, హరిదాసు, గొబ్బిళ్ల పాటలు పాడుతూ వచ్చిన మహిళలకు కానుకలు అందించి భోగి పండుగ విశిష్టతను పిల్లలకు వివరించారు. ప్రజలు అందరికీ భోగి పండుగ బోగ భాగ్యాలు అందించి అన్నింటా విజయం వరించాలని ఆకాంక్షిస్తూ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్ర ముగ్ధులను చేసిన బానుజా నృత్యం



ప్రజాశక్తి - తిరుపతి : ధనుర్మాస పర్వదినాన్ని పురస్కరించుకొని టిటిడి నిర్వహించిన గోదాదేవి కళ్యాణ నృత్య రూపకం భక్తిపారవశ్యంతో సాగింది. ఈ సందర్భంగా నృత్యనిపుణరాలైన డాక్టర్ ఉషారాణి శిష్యురాలు కుమారి ఎం.భానుజా బృందం ప్రదర్శించిన నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ధనుర్మాస దినాలను పురస్కరించుకొని టీటీడీ ఆల్వార్ దివ్య ప్రబంధా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడు డిసెంబర్ 16 నుండి 30 రోజులపాటు అన్నమాచార్య కళా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ . ఇందులో భాగంగా సోమవారం గోదాదేవి కళ్యాణ నృత్య రూపకాన్ని నిర్వహించారు. భానుజా ప్రదర్శించిన హావ భావాలు భక్తుల హర్షధ్వానాలను అందుకున్నాయి.

వైసిపి పూర్వ వైభవానికి కృషి: రాకేష్

ప్రజాశక్తి -నారాయణ వనం: నారాయణ వనం మండలంలో వైసిపి పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టి రాకేష్ కిరణ్ తెలిపారు. జిల్లా పార్టీలో పదవి వచ్చిన సందర్భంగా సోమవారం సాయంత్రం నాయకులు రాకేష్ కిరణ్ ని ఘనంగా పెద్ద ఎత్తున గజా పూలమాలతో, దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా కమిటీలో పదవి రావడానికి కారణమైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ మిథున్ రెడ్డి జిల్లా వైసిపి అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి తిరుపతి పార్లమెంటు సభ్యులు ఎంపీ గురుమూర్తి సత్యవేడు వైసిపి ఇన్ఛార్జి నూక తోటి రాజేష్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ రవి, మాజీ సర్పంచులు దొర అన్నా దొరై, అశోక్ , మంజునాథ్, తిరువేంగడం, ఎన్ కైలాసం, గోవిందస్వామి పాల్గొన్నారు.

కొండచుట్టు మండపం కనుమరుగు

- సంక్రాంతి పర్వదినాల్లో ఆఖరి రోజు ఉత్సవం
- కనుమరుగైన కొండ చుట్టు మండపం
- అర్ధాంతంగా ఆగిన నూతన మండపం
- భక్తులకు ఇబ్బందికరం


గతంలో వున్న కొండచుట్టు మండపం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సంక్రాంతి పర్వదినలో ఆఖరి రోజు కొండచుట్టు ప్రదర్శన నిర్వహించేందుకు పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో రాజా వారు నిర్మించిన కొండచుట్టు మండపాన్ని కూల్చేశారు. పది సంవత్సరాల క్రితం చిత్తూరు -పుత్తూరు రోడ్డు విస్తరణలో భాగంగా గుత్తేదారులు కూల్చివేశారు. కనుమ పండుగ రోజు పుత్తూరు పట్టణంలోనే కాక పరిసర ప్రాంతాల నుండి ఉత్సవ దేవతలను ఊరేగింపుగా తీసుకొచ్చి గిరి ప్రదర్శన చేసి ప్రత్యేక విశిష్ట పూజలు చేస్తూ ఈ ప్రదర్శనకు పుత్తూరు పరిసర ప్రాంతాల వారు, భక్తులు తరలివచ్చి కొండచుట్టును తిలకిస్తారు. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ మండపం రోడ్డు విస్తరణ సమయంలో కనుమరుగైంది. గత వైసిపి ప్రభుత్వం లో మాజీ మంత్రి రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 25 లక్షల రూపాయలతో కొత్త మండపానికి శ్రీకారం చుట్టారు. నిధులు చాలదని గుత్తేదారులు నిర్మాణాన్ని పూర్తిగా అర్ధాంతరంగా ఆపివేశారు. కనీసం ఈ సంక్రాంతికైనా ప్రస్తుత పాలక మండలి స్పందించి ఈ మండపాన్ని పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్రానికి సిల్వర్ మెడల్స్


సిల్వర్ మెడల్ స్వీకరిస్తున్న విజేతలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లోని లేక్ యు గార్డెన్స్ లో నిర్వహిస్తున్న మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ ఛాంపియన్షిప్ 2025 లో రాష్ట్రానికి సిల్వర్ మెడల్స్ దక్కింది. సోమవారం ముగిసిన ఈ పోటీలకు అనూహ్య స్పందన రావడంతో అన్ని రాష్ట్రాల నుండి వందల సంఖ్యలో క్రీడాకారులు పోటా పోటీగా పాల్గొన్నారు. ఈ పోటీలలో మిస్టరీ ఇండియా 2025 గా మధ్యప్రదేశ్ కి చెందిన మహేష్ శర్మ టైటిల్ గెల్చుకున్నారు. మహిళల విభాగంలో మధ్యప్రదేశ్ కి చెందిన పింకీ మిస్ ఉమెన్ గా గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లాకు చెందిన టి వెంకటేష్ 65 కేజీలు విభాగంలో సిల్వర్, 65 కేజీలు విభాగంలో జి లీల సాగర్ సిల్వర్ మెడల్ సాధించారు. 65 కేజీలు విభాగంలో టీ ఆదినారాయణ ఐదవ స్థానం గెలుపొందారు. వీరు ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు మస్కట్ దేశంలో మస్కట్ ప్రభుత్వ నిర్వహించే ఏషియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ 2025 లో పాల్గొననున్నారని జాతీయ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. కేరళ కొచ్చిన్ లో సీనియర్ మిస్టర్ ఇండియా 2025 ఛాంపియన్షిప్ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, ఛైర్మన్ మోహన్ సింగ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి జీవీ బాబు, దీపేంద్ర సింగ్ సోలంకి, రితీష్ వీరినాథ్, ఇంటర్నేషనల్ జడ్జ్ షకీల్ (మస్కట్ దేశం) ఎస్ వి శివప్రసాద్ ఏ భాస్కర్ శ్రీహరి పాల్గొన్నారు.

గడువులోపు త్రైమాసిక పన్నులు చెల్లించండి

- అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు
- జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్



రికార్డులు తనిఖీ చేస్తున్న రవాణా శాఖాధికారులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రవాణా సేవలను ఆంధ్ర రాష్ట్ర పోర్టల్ ఈ ప్రగతి నుండి 'వాహన్' పోర్టల్ లోకి మార్చిన తర్వాత చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులు పూర్తి స్థాయిలో నెల చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే చెల్లించాలని స్థానిక జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా రవాణా శాఖ కార్యాలయంలో ఆ రోజే సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వివిధ ప్రదేశాల నుండి తిరుపతికి వచ్చే ప్రైవేట్ బస్సులపై తిరుపతి జిల్లాలోని రేణిగుంట రోడ్డు ఆంజనేయపురం, నాయుడుపేట, గూడూరులలో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో ముఖ్యంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో తనిఖీల్లో ప్రయాణికులనుంచి అధిక చార్జీ వసూలు చేస్తున్న 25 బస్సులను గుర్తించామన్నారు. వీటిపై వాహన తనిఖీ రసీదులు నమోదు చేసి 3 లక్షల రూపాయల జరిమానా విధించారు. ముఖ్యంగా ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ ట్రావెల్ బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచి గుర్తించేందుకు అధికార యంత్రాంగంతో ప్రతిరోజు రెండు బృందాలతో నాలుగు టీములను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ తనిఖీలు ఈనెల 19 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా అధిక ఛార్జీల వసూలుకు సంబంధిత కేసులే కాకుండా, సరుకు రవాణాపై 8 కేసులు, ప్రయాణికుల జాబితా ప్రదర్శించకపోవడం వంటి కారణాలతో కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, అతి కనాజ్, మోహన్ కుమార్ ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత పాల్గొన్నారు.

సమాజ సేవకులకు ప్రజాకళావేదిక పురస్కారం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తూ సమాజ శ్రేయస్సుకు శ్రమించే సేవాపరులకు ప్రజా కళావేదిక పురస్కారాలతో ఘనంగా సత్కరించింది. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఈ పురస్కారాలను గ్రహీతలకు అందించారు. ప్రజా కళావేదిక అధ్యక్షుడు అరవ జయపాల్, శ్రీశ్రీ కళావేదిక గుత్తహరి సర్వోత్తమ నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రచయిత సురేంద్ర రోడ్డ పిల్లలకు విజ్ఞానం అందించడంతోపాటు అద్భుత రచనలతో సాహితీ సేవలందిస్తూ శిశిరం సినిమాకు మూడు కన్నులు చాలా ముక్కంటి అనే సినీ గేయాన్ని అందించి తొలిపాటతోనే సురేందర్ రోడ్డ గొప్ప పేరు పొందారన్నారు. వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రోజా రమణి ప్రశంసలు అందుకున్నారని, ఉపాధ్యాయుడుగా కవిగా రచయితగా ఉత్తమ సేవలు అందిస్తూ పేరుగాంచిన గుత్తి వెంకటస్వామి అభినందనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రోజా రమణికి మదర్ థెరిస్సా అవార్డు, సురేంద్ర రోడ్డ కు సిరివెన్నెల సినీ పురస్కారం, వెంకటస్వామికి సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డును ప్రదానం చేసి అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జిల్లా ఉన్న విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని నారవారిపల్లెకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎనిమిది డిమాండ్ లతో కూడిన వినతిపత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి సోమవారం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ లను విడుదల చేయాలని, తిరుపతి నియోజకవర్గంలో ప్రైవేట్, కార్పొరేట్ , టిటిడి కళాశాలలు తప్ప ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవని జూనియర్, డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని, చంద్రగిరిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భావనలు లేవని దీని ద్వారా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్ట్ లు భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్స్ కి నాన్ నెట్ ఫెలోషిప్ 15 వేలు ఇవ్వాలని కోరారు. ఎస్వి యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఎంబీఏ, ఎంసీఏ, బిఈడి కళాశాలలు తరగతులు నిర్వహించకుండా విద్యార్థుల దగ్గర నుంచి వేల రూపాయల ఫీజు వసూలు చేస్తూ వర్సిటీ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కళాశాల పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్వి యూనివర్సిటీలో రెగ్యులర్ వైస్ ఛాన్సెలర్, రెక్టార్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులను ఆదేశించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బెరర్స్ తేజ, బాల, నాయకులు రెడ్డి కుమార్ పాల్గొన్నారు.

జానపద కళల సంబరం

సంక్రాంతి కవి సమ్మేళనంలో కవులు


సంక్రాంతి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: పండుగలు మన వారసత్వ సంపదలుగా కాపాడుకుంటూ భవిష్యత్తు తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రచయిత గొడుగుచింత గోవిందయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీకళా వేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి అధ్యక్షతన సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని సంక్రాంతి విశిష్టత, తెలుగు భాష ఔన్నత్యం, సంస్కృతి సంప్రదాయాలు, సమకాలీన అంశాలు, మానవ విలువలతో పాటు బాలికలు, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై స్వీయ కవితలు వినిపించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సిద్ధార్థ జూనియర్ కాలేజీలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు సోమవారం స్థానిక హాట్ స్పాట్ ఫంక్షన్ హాలులో ఆత్మీయంగా కలుసుకున్నారు. 25 ఏళ్ల తరువాత ఒకరికొకరు ఎదురుపడ్డ వీరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పనబాక హైమ, దివ్య, జయకృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004 -2007 సంవత్సరంలో బీకాం, సిఏ ఇంగ్లీష్ మీడియం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం కళాశాలలో సందడిగా సాగింది. మిత్రులను కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి విశ్రాంత ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఆర్.రాజేంద్ర నాయుడు, డాక్టర్ రవి వర్మ , ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అధ్యాపకులు నాగయ్య అతిథులుగా విచ్చేశారు. తమకు విద్యనందించిన అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థులు శోభన్ , హరిప్రసాద్ శ్రీనాధ్ ,ఎం.జి. రామచంద్రన్ ,గోపి , సుబ్రమణ్యం , వెంకటేష్ నేతృత్వం వహించారు..

ఘాట్ రోడ్లో దట్టమైన పొగమంచు

వాహనదారులు అప్రమత్తంగా వుండాలని టిటిడి సూచన

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలకు వెళ్లే రెండవ ఘాట్లో దట్టమైన పొగమంచు కారణంగా ముందు ఉన్న వాహనాలు సరిగ్గా కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. ఈ కారణంగా వాహనదారులు దయచేసి ఘాట్ రోడ్డు లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టిటిడి అధికారులు సోమవారం సూచించారు.

భక్తుల మృతిని రాజకీయం చేయొద్దు: జగదీష్



మాట్లాడుతున్న న్యాయవాది జగదీష్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల మంజూరు లో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడాన్ని రాజకీయం చేయొద్దని రాజకీయ పక్షాలకు న్యాయవాది జగదీష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుందని, గాయపడిన భక్తులకు పరిహారంతో పాటుగా సంతృప్తికంగా శ్రీవారి దర్శనం కల్పించిందన్నారు. ఇలాంటి సంఘటన పట్ల రాజకీయాలకు అతీతంగా స్పందించి భరోసా కల్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నరసింహ యాదవ్, బాలినేని లోకనాథ్ నాయుడు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కళ తప్పిన సంక్రాంతి

- గొబ్బిపాటలు, హరిదాసులు కరువు
- కానరాని అటలు, పాటలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: నేటి పోటీ ప్రపంచంలో పాశ్చత్య సంస్కృతికి పాకులాడుతున్న నేటి కాలంలో సంస్కృతులు, సంప్రదాయాలు కనుమరుగు వుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలు సైతం పట్టణాలకు ధీటుగా పరుగు పెడుతున్నాయి. ఇలాంటి తరుణంలో సంక్రాంతి పండగ కళ తప్పింది. నాటి గొబ్బి పాటలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు జల్లెడపట్టి చూసినా కనిపించవు. కార్పొరేట్ శక్తుల కబంద హస్తాల్లో పాలకులు ఉన్నన్ని రోజులు పండగలే దండగ అనే రీతిలో సమాజం వెళుతుండడం గమనార్హం.

సంక్రాంతి నాలుగు రోజుల పాటు గ్రామగ్రామాన అన్నదాతలు ఆనందంగా నిర్వహించుకునే పండుగ. దక్షణాదిన పెద్ద పండగ అని కూడా పిలుస్తారు. సూర్యుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయానికి మార్పు చెందే రోజు. వాతావరణంలో మార్పు తీసుకొచ్చే సమయం. రైతులు ఏడాది పాటు కష్టించి, శ్రమకోర్చి పండించిన ధాన్యాన్ని ఇళ్లకు తెచ్చుకునే కాలం. అందరూ ఆనందోత్సాహాల మధ్య బంధుమిత్రుల సమేతంగా నిర్వహించుకునే పండుగ సంక్రాంతి. గ్రామగ్రామాన ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులతో ఆకర్షించే రీతిలో పెద్ద పెద్ద రంగవల్లులు వేసి అందులో కట్టెలు, పిడకలు వేసి మండించి భోగిలోనే నీటిని కాంచి వాటితో ఇంటిల్లి పాది తలంటి స్నానం చేసి భోగి పండుగను ప్రారంభిస్తారు. కొత్త అల్లుళ్లు, తోడి కోడళ్లు, బావలు, మరదళు , అత్తా మామలు, అన్న దమ్ములు, అక్కా చెల్లెళ్లు అందరూ కలిసి మాంసాహారాలు తింటూ ఆనందంగా గడుపుతారు. సాయంత్రం రేగి పళ్లతో పిల్లలకు తలంబ్రాల్లా పోసి కలకాలం, నిండు నూరేళ్లు జీవించి, పది మందికి సహాయపడుతూ అందరి మన్ననలు పొందాలని దీవిస్తారు. రెండోవ రోజు సంక్రాంతి పండుగకు వాకిళ్లు శుభ్రం చేసి రంగు రంగుల ముగ్గులు వేసి చెరుకు గడలు, పసుపు కొమ్ములు, మామిడాకులు, అరిగెళ్లతో అలంకరిస్తారు. ముగ్గు మధ్య రంగులతో తీర్చిదిద్దిన మట్టి కుండను ఉంచి అందులో పాలుపోసి పొంగళ్లు పెట్టి అందరికీ పంచి పెడతారు. అదే రోజు అమ్మలక్కలు కలిసి ఆవుపేడ, పసుపుతో గొబ్బెమ్మను తయారు చేసి పూలతో అందంగా అలంకరించి, చిన్నపెద్ద అని తేడా లేకుండా మహిళలందరూ కలిసి వీధుల్లో గొబ్బిలాడుతూ గొబ్బి పాటలు పాడుతూ సరదాగా గడుపుతారు. గంగిరెద్దులను అందంగా ముస్తాబు చేసి డూడూ బసవన్న అంటే గంగిరెద్దులు చేసే విన్యాసాలు చూడముచ్చటగా ఉంటాయి. వేకువ జామునే ప్రతి ఇంటి ముందు హరిదాసులు కీర్తనలు పాడుతూ చేతిలో పిడతలు, మరో నడుముకు తంబూర తగిలించి, తలపాగా చుట్టి, దానిపై రంగులతో అలంకరించిన మట్టికుండను ఉంచుకుంటూ ఆలపించే పాటలు ఇనసొంపుగా ఉంటాయి. పిల్లలంతా కలిసి చెరువు గట్టు ఒడ్డున నిలబడి పతంగాలు (గాలి పటాలు) ఎగురవేసి కేరింతలు కొడతారు. పెద్దలకు తర్పణాలు వదిలి, పిండ ప్రదానాలు చేసి, ఇళ్లల్లో పిండి వంటలు వండి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజంతా సరదాలకు కొదవ ఉండదు. మరుసటి రోజు పశువులను శుభ్రంచేసి, పూలతో, రకరకాల రంగులతో అలంకరించి, అందంగా ముస్తాబు చేసి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. ఇలా మూడు రోజుల పాటు గ్రామాల్లో పండుగ వాతావరణం ఆనందంగా సాగుతుంది. కొంటె మరదల చేష్టలు, బావా మరదల సరదాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఆనందాలకు నెలవు సంక్రాంతి. కానీ నేడు సంక్రాంతికి ఆ కళ తప్పింది. మారిన వాతావరణాలకు తోడు పాలకుల నిరంకుశత్వం, రైతులంటే నిర్లక్ష్యం, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాయడం, కార్మిక, కర్షకులను విస్మరించడం వంటి కారణాలతో పల్లెల్లో వ్యవసాయం తగ్గుముఖం పట్టింది. ఉన్న కాస్తకూస్తో భూమిని కూడా కంపెనీల కోసం ప్రభుత్వాలు భూ సేకరణ పేరుతో లాక్కోవడం, కరువు కాటకాలు, వరద బీభత్సాలతో వ్యవసాయంపై రైతులకు ఆశలు సన్నగిల్లడంతో నాటి జ్ఞాపకాలు కనుమరుగువుతున్నాయి. ఉన్న పొలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసి, వచ్చిన సొమ్ముతో పిల్లల చదువులు కోసం రైతు, రైతు కూలీలు పట్టణాల బాట పడుతున్నారు. నగరాల్లో భవన నిర్మాణ కూలీలుగా, పారిశుధ్య కార్మికులకు పొట్ట పోసుకుంటూ సంక్రాంతి వంటి పండుగ రోజుల్లో తమ సొంతూరికి తామే చుట్టాలుగా వెళ్లాల్సిన పరిస్థితులు పల్లె వాసులకు దాపురించాయి. అయినా ఆ నాటి జ్ఞాపకాలపై ఆశతో సంక్రాంతి రోజుల్లో సొంతూళ్లకు వెళ్లి, అప్పులు చేసి మరి తూతూ మంత్రంగా పిల్ల పాపలతో కలిసి పండుగ చేస్తున్న రీతిలో కానిస్తుండడం శోచనీయం. పాలకులు తీరులో మార్పు వచ్చి పాతరోజులు తిరిగి వచ్చి, అన్నదాతలను నిజమైన రాజులుగా మార్చే కాలం వస్తుందని ఆశిద్దాం..



ఆ రోజులే వేరే..

ఆ రోజులే వేరు.. మాది చిన్నపల్లెటూరు. 50, 60 ఇళ్లు ఉండే ప్రాంతం. ఆ ఊరికి నేను పినపెద్ద. ప్రతి రోజూ కోడి కూసే జామునే నిద్రలేసి పొలాలకు వెళ్లి పనులు చేసుకుని, సాయంత్రానికి ఇంటికొచ్చి పెందలకాడే తిని, రాత్రిపూట వెన్నెల వెలుతురులో ఆటలాడుతూ పాటలు పాడుతూ నిద్రవచ్చే వరకు కబుర్లు చెప్పకుంటూ ఉండేవాళ్లం. సంక్రాంతి వస్తుందంటే నెల, రెండు నెలల నుంచి అందుకు సిద్ధమవుతుంటాం.. కొత్తగా పెళ్లైన అల్లుళ్లు, కోడలు, ఇతర బంధువులను పిలిచి, వారికి కొత్త దుస్తులు కొనిచ్చి, గొబ్బి పాటలు పాడుతూ , ఆవులను అలంకరించి వీధుల్లో తిప్పుతూ అబ్బో అదికదా పండగ. ఇప్పుడు అవేవీ లేవు. సొంతూరికి పోయి పదేళ్లు అవుతోంది.

-వెంకటస్వామి, సామాన్యరైతు, తిరుపతి.

పండగ రోజుల్లో పోయొస్తాం..

ఐరాల సమీపంలో చిన్న పల్లెటూరు మాది.. నిత్యం పచ్చని పొలాలతో నిండి ఉంటుంది. ఊరుకు చుట్టూ పక్కల మూడు పెద్ద చెరువులు. మామిడితోపులు, ఇళ్లకు ఆనుకునే చెరుకు తోటలు, వాటిని దాటుకుని కొంత దూరం వెళితే వరి మడులు. మరో దిక్కున వేరుశనగ చేళ్లు, అక్కడక్కడ అరిటి, పూల తోటలు. మాది అందమైన ఊరు. 20 సంవత్సరాల క్రితం కుల రక్కసి కోరలకు కొంత మంది యువకులు బలి కావడంతో గొడవలు, కొట్లాటలతో ఊరికి ఊరే వలసొచ్చాం. మడులన్ని బీడయ్యాయి. తోపులు ఛిద్రమయ్యాయి. ఇప్పుడు మా ఊరు బీడు భూములతో బిక్కమొహం వేస్తోంది. అయినా తప్పదన్నట్లు ఈ పండుగ రోజు మూడునాళ్లు ఊరికెళ్లి అక్కడే ఉండి, తిరిగి బతుకుతెరువు కోసం టౌన్కు వచ్చేస్తాం.

- కె కన్నయ్య, రైతు కూలీ, ఐరాల మండలం.